ప్రగతి కాంతులు

నాడు: టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ 58 వవార్డులో అభివృద్ధి పనులు చేపట్టలేదు. శిథిలమైన రోడ్లు.. జనావాసాల మధ్య మురుగుతో ఇబ్బందులు పడేవారు. అనారోగ్యం తలెత్తితే గాజువాకో.. విశాఖ నగరానికో వెళ్లాల్సి వచ్చేది. చిన్నపాటి సమావేశాలు.. ఫంక్షన్లు నిర్వహించుకోవాలన్నా రోడ్లే వేదికలు.

నేడు: జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల రూపురేఖలు మారాయి. మురుగు కష్టాలకు చెక్ పెట్టేలా రూ.1.50 కోట్లతో డ్రైనేజీ నిర్మించారు. ప్రజలకు చెంతనే వైద్యం అందేలా ములగాడలో యూపీహెచ్‌సీ నిర్మించారు.సామాజిక అవసరాలకు వినియోగించుకోవడానికి వీలుగా సామాజిక భవనాలు నిర్మించారు. అవసరమైన చోట రోడ్లు వేశారు. దీంతో వార్డు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- 58వ వార్డులో రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు
- యూపీహెచ్‌సీ నిర్మాణంతో చెంతనే వైద్యం
- డ్రైనేజీ నిర్మాణంతో మురుగు కష్టాలకు చెక్
- రోడ్ల నిర్మాణంతో హాయిగా రాకపోకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న 58వ వార్డు ప్రాంత ప్రజలు



మల్కాపురం: టీడీపీ హయాంలో జీవీఎంసీ 58వ వార్డులో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగా ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. వార్డులో ఏ మారు మూలకు వెళ్లినా కంటికి ఇంపుగా అక్కడ చేసిన అభివృద్ధి కనిపిస్తోంది.దీంతో విమర్శకులు సైతం షెభాష్ అంటున్నారు. వార్డు పరిధిలోని ములగాడ, ఎదురవానిపాలెం శివారు ప్రాంతాలుగా ఉండేవి. ఆ ప్రాంతాల సంగతి పారిశ్రామిక ప్రాంతంలో నేటికీ చాలా మందికి తెలియదు అంటే అతిశయోక్తి కాదు. అలాంటి ప్రాంతాల రూపురేఖలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మార్చింది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఎదురవానిపాలెం,ములగాడ గ్రామాల్లో అధ్వానంగా మారిన శ్మశానవాటికలను రూ. 70 లక్షల తో ఆధునికీకరించడంతో పాటు అధునాతన వసతులు కల్పించారు. చిన్న ములగాడ వద్ద గ్రామస్తుల కోసం రూ. 14 లక్షలతో సామాజికభవనం, ములగాడ గ్రామంలో వర్షపు నీరు నిలిచిపోకుండా రూ. కోటి వ్యయంతోరెండు కిలో మీటర్ల మేర సీసీ గెడ్డ నిర్మించారు. ఇలా వార్డులోని ప్రతి ప్రాంతంలో ప్రగతి కాంతులు పూయించారు.


రూ 25 లక్షలతో వేసిన గొందేశివానిపాలెం రోడ్డు


నూతనంగా నిర్మించిన గెడ్డ

వార్డులోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు.. చేసిన వ్యయం

- గుల్లలపాలెం నుంచి ములగాడ వరకు ప్రధాన గెడ్డ నిర్మాణం: రూ. 1.50 కోట్లు
- ములగాడలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం: రూ 1.20 కోట్లు
- గొందేశివానిపాలెంలో బీటీ రోడ్డు : రూ. 25 లక్షలు
- ఎదురవానిపాలెంలో సీసీ రోడ రూ. 80 లక్షలు
- గుల్లలపాలెంలో సామాజికభవనం: రూ. 18 లక్షలు
- ములగాడలో సామాజికభవనం: రూ. 35 లక్షలు

ఎదురవానిపాలెంలో సామాజికభవనం : రూ 20 లక్షలు

- శ్రీనివాస్‌నగర్ ప్రాంతంలో సీసీ రోడ్లు: రూ. 75 లక్షలు
- ఉప్పరకాలనీ,ములగాడ ప్రాంతాల్లో సీసీ రోడ్లు: రూ. 52 లక్షలు
- ఉప్పరకాలనీలో సామాజికభవనం : రూ. 19 లక్షలు

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



జీవీఎంసీ 58వ వార్డులో ఇప్పటికే కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాం.త్వరలో మరో రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపడతాం. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై వార్డు ప్రజలు ఆలోచన చేయాలి.వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ , పశ్చిమ సమన్వయకర్త

చాలా అభివృద్ధి జరిగింది



గొందేశివానిపాలెం,ములగాడ, ఎదురవానిపాలెం ప్రాంతాల్లో గతంలో బీటీ,సీసీ రోడ్లు చాలా అధ్వానంగా ఉండేవి. ఆయా ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఆడారి ఆనంద్ కుమార్‌కు సమస్యలు వివరించాం. కొద్ది నెలల్లోనే కోట్ల రూపాయలతో సీసీ,బీటీ రోడ్లు వేసి చూపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా వార్డులో చాలా అభివృద్ధి పనులు చేపట్టారు.

– పిలక అప్పలరెడ్డి , పిలకవానిపాలెం

సంతోషంగా ఉంది



మా ఎదురవానిపాలెంలో సామాజికభవనం నిర్మించారు. బీటీ,సీసీ రోడ్లు వేయడమే కాకుండా అధ్వానంగా ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. మంచి వసతులు కల్పించారు. మా ప్రాంతాన్ని చూస్తే చాలా ఆనందంగా ఉంది. ఆడారి ఆనంద్‌కుమార్ మా ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

– కృష్ణవేణి, ఎదురవానిపాలెం


ములగాడలో నిర్మించిన ఆస్పత్రి


అభివృద్ధి చేసిన ములగాడ శ్మశానవాటిక


చిన్న ములగాడలో నిర్మించిన సామాజిక భవనం

క్లుప్తంగా

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

సింధియా: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను లబ్ధిదారులు నమ్మవద్దని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకే రుణం తెచ్చుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల ఎప్పుడూ కావాలంటే అప్పుడు సర్టిఫైడ్ కాపీ పొందే వీలుంటుందని, ఫోర్జరీ, ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదన్నారు. ఇంత మంచి పనిని ఓర్వ లేక ప్రతిపక్షాలు, ఒక వర్గం మీడియా తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు విశ్వాసం, అభిమానం ఉన్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి


మృతుడు పిప్పల వీరబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా ఐపోలవరం మండలం టి. కొత్తపల్లి గ్రామానికి చెందిన పిప్పల వీరబాబు(27) బాజీ జంక్షన్‌లోని పకోడి బండి వద్ద పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం నడుచుకుని వెళ్తూ ఒక్కసారిగా పడి పోయాడు. ఇది గమనించిన స్థానికులు కాపాడేందుకు యత్నించారు.వెంటనే గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే సరికి మృతి చెందినట్లు గుర్తించారు. వీరబాబు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పౌర హక్కుల పరిరక్షణకు కృషి

సీతంపేట: పౌర హక్కుల పరిరక్షణకు 1948 డిసెంబర్ 10న పారిస్‌లో సమావేశమైన ఐక్య రాజ్య సమితి సర్వప్రతినిధి సభ ప్రతిజ్ఞ చేసిందని జాతీయ మానవ హక్కుల సమాఖ్య ఉపాధ్యక్షుడు మళ్ల వెంకటరావు అన్నారు. అక్కయ్యపాలెంలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యాలయంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అహ్మద్ బాషా అధ్యక్షతన «న్యాయం కావాలి» అనే నినాదంతో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులను నిర్వచించిన ఐక్య రాజ్య సమితి.. మనుష్యులందరూ సమానమని, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభిస్తాయని తీర్మానించినట్లు గుర్తుచేశారు. మానవ హక్కుల చరిత్రలో ఆ ప్రకటన ఒక మైలు రాయని, ఇది వెలువడిన నాటి నుంచి 77 ఏళ్లుగా స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం లభిస్తోందన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగినా, సమస్యలు ఎదురైనా పరిష్కారం కోసం మానవ హక్కుల సమాఖ్య ప్రతినిధులు ముందుండాలని పిలుపునిచ్చారు. సమాఖ్యను బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్ణానందరావు, సతీష్‌కుమార్, బండి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ


ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు యువత ఆంగ్ల భాష సులువుగా నేర్చుకునేందుకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ సలహాదారు మిలీనియం శ్రీధర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, చుక్క వరలక్ష్మి ,టి.వెంకటరమణిలతో సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీదేవి వర్మ, పార్టీ నాయకులు పూండి మల్లేశ్వరరావు, గుంట సుందర్‌రావు, ఆడారి హరీష్ తదితరులు ఆనంద్‌కుమార్‌కు శాలువ కప్పి సన్మానించారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఆనంద్‌కుమార్ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమైనవని అభినందించారు.

సందేశాత్మక చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'

హీరో దీపక్ సరోజ్



మీడియాతో మాట్లాడుతున్న హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి, కీర్తన

అల్లిపురం: యదార్థ సంఘటన ఆధారంగా యువతకు సందేశం ఇచ్చే చిత్రంగా సిద్ధార్థ్ రాయ్ నిర్మించినట్టు ఆ చిత్రం హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందన్నారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు నగరంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా యశస్వి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కించినట్లు తెలిపారు. ఎటువంటి ఎమోషన్స్ లేకుండా తిండి, నిద్ర, రొమాన్స్ మాత్రమే కావాలనుకునే యువకుడు ప్రేమకు ఎలా లొంగిపోయాడు అనేది సిద్ధార్థ్‌రాయ్ చిత్ర కథన్నారు. లాజికల్ నుంచి ఎమోషన్‌కు మారే సిద్ధార్థ్ క్యారెక్టర్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందన్నారు. నిర్మాత ఫణి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా తీశారన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఇందు క్యారెక్టరు చేశానని, ఎంతో ధైర్యవంతమైన యువతిగా కనిపిస్తానన్నారు. మరో నటి కీర్తన మాట్లాడుతూ చిత్రంలో కీర్తి క్యారెక్టర్ మంచి పేరు తీసుకొస్తుందన్నారు.


ముగిసిన షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

216 కలశాలతో బాబాకు క్షీరాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు శాతవాహన నగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర 19వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట శ్రీధర స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో సాయినాథుడికి 216 కలశాలతో సుమారు వెయ్యి లీటర్ల పాలతో భక్తుల చేతుల మీదుగా సామూహిక అభిషేకం నిర్వహించారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి వేకువజాము నుంచే విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, మహా పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం, విశిష్ట హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. అనంతరం సాయినాథుడికి ప్రసాదంగా పెట్టిన 10 కేజీల లడ్డూను కాట్రగడ్డ దుర్గాప్రసాద్ అనే భక్తుడు రూ.85 వేలకు దక్కించుకున్నాడు. ముగింపు వేడుకల్లో దత్తసాయి మందిర కమిటీ ప్రతినిధులు బండ్రెడ్డి శేషగిరిరావు, కాట్రగడ్డ దుర్గాప్రసాద్, మేకా శ్రీనివాసరావు, పి.ధనుంజయ రెడ్డి, వేములపల్లి రామచంద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు ఆహ్వానం


విజయ్ భావరాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని అమెరికాకు చెందిన ఈటాస్ రీసెర్చి ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపాల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజుని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి స్వాగతించారు. శనివారం ఏయూను సందర్శించిన డాక్టర్ విజయ్‌తో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి కార్యాలయంలో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న పలు స్టార్టప్‌లకు తాను మార్గదర్శకం వహిస్తానని డాక్టర్ విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్ అనే అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణపై చర్చించారు.

'సింహాద్రి'లో ఎంవోసీ నాగరాజు


యాష్ పాండ్‌ను సందర్శించిన అడిషనల్ సెక్రటరీ నాగరాజు, అధికారులు


పరవాడ : పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీని భారత ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ(ఎంవోసీ) నాగరాజు శనివారం సందర్శించారు. సముద్రిక అతిథి గృహం వద్ద నాగరాజుకు సంస్థ ఓ అండ్‌ఎం జీఎం డీపీ పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా తొలుత సంస్థకు చెందిన మోడల్ ప్లాంటు, మెయిన్ ప్లాంటు కంట్రోల్ రూం, యాష్ డైక్ ఏరియా, వ్యాగన్ టింప్లర్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీవాటర్ పంప్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంటు పనితీరును అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఆపరేషన్ జీఎం టి.రాజగోపాలన్, ఫైనాన్స్ జీఎం కె.జె.రావు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల రక్షణకు చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, దాడులపై లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. గాజువాక కోర్టు 3వ ఏసీఎం ఎం.రాజేంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో 9 మందికి మించి ఉన్న మహిళా ఉద్యోగుల్లో ఒకరి వద్ద నుంచి ఫిర్యాదును నమోదు చేసి విచారిస్తామని తెలిపారు. 9 మంది లోపు ఉద్యోగినులు ఉన్న కార్యాలయాల్లో కలెక్టర్ ఒక ప్రతినిధిని నియమించి విచారిస్తారన్నారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో 8 ఎంఎంసీ వై.శ్రీలక్ష్మి, ఏసీపీ త్రినాథ్, బీపీఎం కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గైస్ అభివృద్ధికి కెమ్‌దోసా సహకారం


విద్యార్థులతో కెమ్‌దోసా సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తుందని కెమ్‌దోసా సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గైస్‌లో అధ్యక్షుడు ఎ.వరహాలు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్(కెమ్‌దోసా) వార్షిక సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదించారు. మొదటి బ్యాచ్(1971–75) నుంచి ప్రస్తుత బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రసంగిస్తూ కాలేజీ అభివృద్ధికి కెమ్‌దోసా సహకారం ఆదర్శనీయమన్నారు. కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోకెమికల్స్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, ఆయిల్ టెక్నాలజీ విభాగాల్లో డిసెంబర్–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, అన్ని విభాగాల్లో టాపర్లకు నగదు అవార్డులు ప్రదానం చేశారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో వివిధ సబ్జెక్టుల్లో టాపర్లకు ప్రత్యేక నగదు అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గైస్ ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన సహకారం అందిస్తామని కెమ్‌దోసా సభ్యులు ప్రకటించారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, కెమ్‌దోసా కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవ

- రూ.10 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- భూమి పూజ చేసిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు


భూమి పూజ నిర్వహిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10లక్షలతో వాహనశాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులకు చేపట్టనున్నామన్నారు. గతంలో ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణమండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు, పీఆర్వో నాయుడు పేర్కొన్నారు.

సమాజంలో సనాతన ధర్మానికి ప్రాధాన్యం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామీ విధేయనందాజీ మహారాజ్

అగనంపూడి: హైందవ సమాజంలో సనాతన ధర్మానికి, ఆచారాలకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని, అవి నేటికీ వర్ధిల్లితున్నాయంటే వాటి గొప్పదనాన్ని గ్రహించాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శ్వాసం విధేయనందాజీ మహారాజ్ అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నా విద్యా సంస్థల ఆవరణలో సనాతన ధర్మంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి దైనందిన జీవనంలో సనాతన ధర్మానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సనాతన ధర్మం వల్ల సమాజం ఒక క్రమ పద్ధతిలో నడుస్తుందని, చట్టాలు, శాసనాలు లేని రోజుల్లో కేవలం ఈ ధర్మంపైనే సమాజం ఆధారపడి మనుగడ సాగించిందన్నారు. స్వీయ ఎదుగుదల, నియంత్రణకు ధర్మం దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. మనిషి నమ్మకాలు, ఆచారాలు, విశ్వాసాలు సనాతన ధర్మంపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పదు


దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ఉక్కు కార్మికుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 1101వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తామని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు.